# ఏపీలో త్వరలో 20వేల ఉద్యోగాల భర్తీ!

★ నియామకాలకు ఆర్థికశాఖ ఆమోదం

★ సీఎం వద్దకు చేరిన దస్త్రం

ఈనాడు, హైదరాబాద్: ఈ ఏడాది 20,250 ఉద్యోగాలు భర్తీ చేసేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమాయత్తమవుతోంది. ఆర్థికశాఖ ఈ మేరకు దస్త్రాన్ని సిద్ధం చేసి ముఖ్యమంత్రి వద్దకు పంపింది. సీఎం ఆమోదముద్ర వేసిన వెంటనే ఏపీపీఎస్సీ, పోలీస్ శాఖల ద్వారా వీటి భర్తీకి నోటిఫికేషన్ జారీచేయడానికి ఏర్పాట్లు చేస్తోంది. రాష్ట్రంలోని మొత్తం 4,83,491 పోస్టుల్లో 77,737 ఖాళీగా ఉన్నట్లు ఆర్థికశాఖ ఇదివరకే తేల్చింది. ఇందులో ఎక్కువ భాగం డ్రైవర్లు, సబార్డినేట్ సిబ్బందివే ఉన్నాయి. కొన్నింటిని పదోన్నతుల ద్వారా భర్తీచేయనున్నారు. ఇవిపోగా మిగిలిన 20,250 పోస్టులను నేరుగా నియమించడానికి అవకాశం ఉన్నట్లు గుర్తించి వాటి భర్తీకోసం సిఫార్సు చేసింది. ప్రస్తుతం ఆర్థికశాఖ ముఖ్యమంత్రికి పంపిన దస్త్రంలో అత్యధికంగా 9వేల ఖాళీలు హోంశాఖలోనే ఉన్నాయి. ఆ తర్వాత గ్రూప్-1 క్యాడర్ 94, గ్రూప్-2లో 1100, గ్రూప్-3లో 1500, వైద్య ఆరోగ్యశాఖలో 450, అన్ని శాఖల్లో ఇంజినీర్లు 1600, ఇతరత్రా పోస్టులు 6500 ఉన్నాయి. ముఖ్యమంత్రి ఆమోదం తెలిపిన వెంటనే నియామకాలకు సంబంధించిన అధికారిక ప్రక్రియ ప్రారంభిస్తామని ఆర్థికశాఖ అధికారులు తెలిపారు. దీనికి ఇదివరకే రాష్ట్ర మంత్రివర్గం కూడా ఆమోదముద్ర వేసింది.